ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## కాంగ్రెస్ అంటేనే అబద్ధం, మోసం

తెలంగాణలో
రుణమాఫీ చేయలేక పోతోంది
కర్నాటకలో
వినాయకుడిని జీపెక్కించారు
టుక్డే..టుక్డే గ్యాంగ్
కాంగ్రెస్‌ను నడిపిస్తోంది
మహారాష్ట్ర వార్ధాలో
మోడీ ఘాటు విమర్శలు

2లో..

సంపుటి: 2 | సంచిక: 163 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 21 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ



**169 మంది అధికారులు, 964 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది**
**రైతులకు సన్న వడ్లపై రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయం**
**మూడు వర్సిటీలకు పేర్లు మారుస్తూ నిర్ణయం**
**తెలంగాణ కేబినేట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత ఉదయం): హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ ఉండేలా నిబంధనలు సడలిస్తూ తెలంగాణ కేబినేట్ నిర్ణయించింది. హైడ్రాకు అవసరమైన సిబ్బందిని వివిధ విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై కేటాయించనున్నారు. 169 మంది అధికారులు, 964 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కేటాయింపు చేయాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరిగింది. భేటీ అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. చెరువులు, కుంటలతో పాటు ప్రభుత్వ స్థలాలను అడ్డగోలుగా ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా హైడ్రాకు అధికారాలు ఇవ్వనుంది. ఇంకోవైపు ఎన్నికల హామీ మేరకు రైతులకు సన్న వడ్లపై రూ.500 బోనస్ ఇచ్చే అంశంపై కూడా మంత్రివర్గం చర్చించింది. ఈ ఏడాది నుంచే సన్న వడ్లపై బోనస్ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. దీంతోపాటు మూడు యూనివర్సిటీల పేర్లు మార్చుతూ ప్రభుత్వం నిర్ణించింది. కోఠీ మహిళా యూనివర్సిటీ పేరును చాకలి ఐలమ్మ యూనివర్సిటీగా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాల యం, టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్‌లూమ్స్ యూనివర్సిటీకి కొండ లక్ష్మణ్ బాపూజీ యూనివర్సిటీగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్ లోపల 27 అర్బన్, లోకల్ బాడీలు ఉన్నాయి. 51 గ్రామ పంచాయతీలను కోర్ అర్బన్‌లో విలీనం చేయాలన్న నిర్ణయానికి కేబినేట్ ఆమోదం తెలిపింది. ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్ ఖరారుకు కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వరయంలో 12 మందితో కమిటీ ఏర్పాటు కానుంది. కమిటీ కన్వీనర్‌గా ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉంటారు. పోలీసు ఆరోగ్య భద్రత స్కీమ్ ఎస్‌పీఎల్‌కు కూడా వర్తించనుంది. మనోహరా బాద్‌లో 72 ఎకరాల్లో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు ఆమోదం ఇచ్చారు. 8 వైద్య కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం చేయనున్నారు. 3వేలకు పైగా పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించారు. ఖమ్మం జిల్లాలో 58 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఆమోదం లభించింది. ములుగు జిల్లా ఏటూరునాగారం ఫైర్ స్టేషన్‌కు 34 మంది సిబ్బంది మంజూరు చేసిటన్లు వెల్లడించారు. కోస్గి ఇంజినీరింగ్ కళాశాల,

..మిగతా 2లో



## సింగరేణి కార్మికులకు దసరా బోనస్

**రూ.796 కోట్లు బోనస్‌గా ప్రకటించిన ప్రభుత్వం**
**ఒక్కొక్కరికి లక్షా 90 వేల బోనస్ ప్రకటన**
**ఒప్పంద కార్మికులకు 5 వేల చొప్పన బోనస్**
**వివరాలు వెల్లడించిన డిప్యూటి సీఎం భట్టి**

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత ఉదయం): సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది.

దసరా పండుగకు ముందుగానే సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే లాభాల్లో వాటా కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ సింగరేణిది కీలక పాత్ర అని.. లాభాల్లో వాటాను దసరా ముందు కార్మికులకు అందిస్తున్నామన్నారు. కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1.90 లక్షల చొప్పున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోనస్ ప్రకటించారు. దసరా ముందు లాభాల్లో వాటా పంచి కార్మికుల కుటుంబాల్లో ఆనందం చూడాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇందుకోసం రూ.796 కోట్లు కేటాయించామన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రతిపాదన మేరకు సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడంలో సింగరేణి కార్మికులు కీలక పాత్ర పోషించారు. సింగరేణి కార్మికులకు బోనస్ ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చింది. దాంతో సింగరేణి కార్మికులకు దసరా బోనస్ ప్రకటిస్తున్నాం. దసరా కంటే ముందుగానే సింగరేణిలో లాభాల వాటా పంచడం ద్వారా కార్మికుల కుటుంబాల్లో ఆనందాన్ని చూడాలనుకున్నాం అని అన్నారు. 2023-24 ఏడాదిలో సింగరేణికి రూ.4,701 కోట్లు లాభం వచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో సింగరేణి కార్మికులకు రూ.796 కోట్లు బోనస్‌గా ప్రకటిస్తున్నట్లు చెప్పారు. సగటున ఒక్కో కార్మికుడికి రూ.1.90లక్షలు బోనస్ వస్తుందన్నారు. సింగరేణి కార్మికులకు సంతోషంగా బోనస్ ప్రకటిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఒప్పంద ఉద్యోగులకు కూడా ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. సింగరేణి లాభాల్లో 33 శాతం బోనస్‌గా ప్రకటించడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కంటే రూ.20వేలు అదనంగా బోనస్ ప్రకటించామని, సింగరేణి చరిత్రలో తొలిసారిగా ఒప్పంద ఉద్యోగులకూ బోనస్ ఇస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటాను దసరా బోనస్ గా ప్రకటించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రూ.4,701 కోట్ల రూపాయల్లో రూ.796 కోట్లను సింగరేణి కార్మికులకు

..మిగతా 2లో


## ఓటుకు నోటు కేసు బదిలీ కుదరదు

**ఊహాజనిత అంశాలతో పిటిషన్ దాఖలు**
**కేసు వివరాలను రేవంత్‌కు రిపోర్ట్ చేయొద్దు**
**ఎసిబికి ఆదేశాలు ఇచ్చిన సుప్రీం ధర్మాసనం**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 (ప్రభాత ఉదయం): సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అలాగే సిఎం రేవంత్‌కు ఊరట దక్కింది. ఈ కేసుపై సుప్రీంకోర్ట్ శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయబోమని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ బదిలీ పిటిషన్‌పై విచారణను అత్యున్నత న్యాయస్థానం ఇవాళ ముగించింది. ఓటుకు నోటు కేసును తెలంగాణా నుంచి మధ్యప్రదేశ్‌కు బదిలీ చెయ్యాలంటూ మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. విచారణను సీఎం ప్రభావితం చేస్తారన్న అపోహ తప్ప ఆధారాలు లేవని

..మిగతా 2లో



పోలీస్ వాహనంలో జానీ మాస్టర్

## జానీ మాస్టర్‌కు 14 రోజుల రిమాండ్

**చంచల్ గూడ జైలుకు తరలింపు**

బుద్వేల్, సెప్టెంబర్20(ప్రభాత ఉదయం): లైంగిక వేధింపుల కేసులో నిందితుడిగా ఉన్న ప్రముఖ కోరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ భాష (42) ను శుక్రవారం రాజేంద్రనగర్ కోర్టులో హాజరు పరిచారు. ఆయనకు న్యాయమూర్తి అక్టోబర్ మూడవ తేదీ వరకు 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తీర్పు చెప్పారు. కోర్టుకు రాకముందు జానీ మాస్టర్ కు అత్తాపూర్ జాయ్ హాస్పిటల్‌లో ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు నార్సింగ్ పోలీసులు, సైబరాబాద్ ఎస్ఓటి పోలీసులు పోలీసు వాహనంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్ పల్లి లో గల 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరిచారు. మీడియాకు జానీ మాస్టర్ ముఖం కనిపించకుండా పోలీసులు నేరుగా కోర్టు ప్రాంగణంలోకి వాహనం తీసుకుపోయారు. ఎర్ర టోపీ, ముఖానికి మాస్క్ ధరించి పోలీసు వాహనంలో దిగిన జానీ మాస్టర్ కోర్టు హాల్‌లోకి

..మిగతా 2లో

## ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తుల పట్ల అధికారులు కఠినంగా ఉండాలి

**దేశానికి సైబర్ క్రైమ్ పెను సవాల్‌గా మారింది:**
**కేంద్ర మంత్రి నిత్యానందరాయ్**
**భారతీయ పోలీసింగ్ భవిష్యత్ కొత్త ఐపీఎస్ అధికారులపై ఆధారపడి ఉంది..**
**కొత్త క్రిమినల్ చట్టాలపట్ల పోలీస్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి..**
**శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీలో 76వ బ్యాచ్ ఐపీఎస్ పాసింగ్ ఔట్ పెరేడ్..**



దీశాంత్ పరేడ్ కార్యక్రమంలో శిక్షణ ఐపిఎస్‌లకు నమస్కరిస్తున్న కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్

రాజేంద్రనగర్,సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) సైబర్ క్రైమ్ దేశానికి పెను సవాల్‌గా మారిందని కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ అన్నారు. హైదరాబాద్ శివారులోని శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీలో 76వ బ్యాచ్ ఐపీఎస్ పాసింగ్ ఔట్ పెరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐపీఎస్‌ల గౌరవందనాన్ని కేంద్రమంత్రి స్వీకరించారు. అనంతరం ఆయన శిక్షణ పూర్తి చేసుకున్న ట్రెయినీ ఐపీఎస్ లకు అభినందనలు తెలియజేశారు. కఠిన శిక్షణ పూర్తి చేసుకుని దేశ సేవ చేయడానికి వెళ్తున్న ఐపీఎస్‌లు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ పోలీసింగ్ భవిష్యత్ కొత్త ఐపీఎస్ అధికారులపై ఆధారపడి ఉందన్నారు. ఉగ్రవాదులు,సంఘ విద్రోహ శక్తుల పట్ల అధికారులు కఠినంగా ఉండాలని సూచించారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీతో అప్డేట్ అవుతూ ఉండాలని చెప్పారు. పెరుగుతున్న సైబర్ క్రైమ్‌ను కట్టడి చేయడానికి కృషి చేయాలన్నారు. సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్స్ ద్వారా కేసులను తొందరగా పరిష్కరించాలని, నేరస్తులను పట్టుకొని వారికి తొందరగా శిక్షలు పడేలా చూడాలని సూచించారు. కొత్త క్రిమినల్ చట్టాలపట్ల పోలీస్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కేంద్రమంత్రి

..మిగతా 2లో

## శ్రీవారి లడ్డూ కల్తీపై సమగ్ర నివేదిక ఇవ్వండి

**కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 (ప్రభాత ఉదయం): తిరుమల శ్రీవారి మహా ప్రసాదం లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వులు కలిపినట్లు వచ్చిన ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. తాజాగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా దీనిపై స్పందించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో నడ్డా మాట్లాడుతూ "నేను

..మిగతా 2లో



## నెయ్యిలో కల్తీ ఉన్నట్లు గుర్తించాం

**పోటులో కూడా తయారీదారులు చెప్పారు**
**గుజరాత్‌లో పరీక్షలకు పంపాక తెలుసుకున్నం**
**కల్తీ నెయ్యిపై టీటీడీ ఈవో శ్యామలరావు వివరణ**

2

# హైడ్రాకు పూర్తి స్వేచ్ఛ

**మొదటి పేజీ తరువాయి...**

హకీంపేటలో జూనియర్ కళాశాల మంజూరు ఇచ్చారు. ఎస్ఎల్బీసీకి సంబంధించిన 4637 కోట్ల రూపాయల రివైజ్డ్ ఎస్టిమేట్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. సెప్టెంబర్ 2027 వరకు ఎస్ఎల్బీసీ పనులు పూర్తి చేసి ప్రాజెక్టును ప్రారంభిస్తామన్నారు. ఎస్ఎల్బీసీ నుంచి ప్రతీ రోజు 4వేల క్యూసెక్కులు.. సంవత్సరానికి 30 టీఎంసీల నీళ్లు 4 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయన్నారు. ఎస్ఎల్బీసీ పనులు తాను ఇరిగేషన్ మంత్రిగా ఉండగా పూర్తి కావడం ఎంతో ఆత్మ సంతృప్తినిస్తుందన్నారు. కాళేశ్వరం మీద లక్ష కోట్లు ఖర్చు పెడితే లక్ష ఎకరాలకు నీళ్లు రాలేదు. కానీ ఎస్ఎల్బీసీ పనులకు 4 వేల కోట్లు ఖర్చు చేస్తే 4 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయన్నారు. 40 కిలోమీటర్ల పనుల్లో ఇంకా 9 కిలోమీటర్లు సొరంగం పూర్తి చేయాల్సి ఉందన్నారు. 20 నుంచి 30 నెలల్లో పనులు పూర్తి అవుతాయన్నారు. ఈ ఖరీఫ్ పంట నుంచే సన్న ధాన్యంకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. జనవరి నుంచి అన్ని రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా చేస్తామన్నారు. నల్గొండ జిల్లా ప్రజలకు మంచి రోజని.. కేసీఆర్ అసెంబ్లీలో ఎస్ఎల్బీసీ గురించి వ్యంగ్యంగా మాట్లాడారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఎ÷-లోరైడ్ కు శాశ్వత పరిష్కారం ఎస్ఎల్బీసీ అని వెల్లడించారు. గతంలోనే మేనిఫెస్టోలో ఎస్ఎల్బీసీ పూర్తి చేసి పొలాలకు నీళ్లు ఇస్తామని చెప్పామన్నారు. శ్రీశైలంలో డెడ్ స్టోరేజ్ ఉన్న గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వొచ్చన్నారు. 24 నెలల్లో పనులు పూర్తి చేసేలా కంపెనీ ప్రతినిధులతో మంత్రులు చర్చించారన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయ్యేలా తనను అమెరికా పంపి సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించేలా చేశారన్నారు. మిషన్ భగీరథలో నల్గొండ జిల్లాలో 4 వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు.






వందనం స్వీకరిస్తున్న కేంద్రమంత్రి నిత్యానంద రాయ్

## ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తుల పట్ల అధికారులు కఠినంగా ఉండాలి

**మొదటి పేజీ తరువాయి...**

చెప్పారు. కొవిడ్ టైమ్‌లో పోలీసుల సేవ గొప్పదని కొనియాడారు. భారత పోలీస్ సేవను అత్యున్నత స్థానంలో నిలబెడతారనే నమ్మకముందని అన్నారు. కాగా, 76వ బ్యాచ్ ఐపీఎస్ పాసింగ్ ఔట్ పెరేడ్ ఘనంగా జరిగింది. పోలీస్ అకాడమీ నుంచి 54 మంది మహిళలు సహా 188 మంది ట్రెయినీ ఐపీఎస్‌లు పాసవుతున్నారు. వారిలోంచి ఏపీకి నలుగురు, తెలంగాణకు నలుగురు ట్రెయినీ ఐపీఎస్‌లను కేటాయించారు.

## జానీ మాస్టర్‌కు 14 రోజుల రిమాండ్

**మొదటి పేజీ తరువాయి...**

వైద్య పరీక్షలు చేపించారు. అనంతరం ఆయనను రాజేంద్రనగర్ సీసీఎస్‌కు తరలించారు. అక్కడి నుంచి ఉప్పర్‌పల్లి కోర్టుకు తీసుకెళ్లి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. గురువారం గోవాలో అరెస్ట్ చేసి హైదరాబాద్ తరలించారు. జానీని ప్రశ్నించేందుకు సమయం దొరక్కపోవడంతో పోలీసులు కస్టడీకి కోరే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. తన వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పనిచేసిన 21 ఏళ్ల యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డట్టు జానీ మాస్టర్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు ఆయనపై అత్యాచారం కేసు నమోదయింది. కేసు విషయం తెలుసుకొని ఆయన పరారయ్యారు. బెంగళూరు గుండా గోవా వెళ్లారు. రంగంలోకి దిగిన పోలీసులు గోవాలో ఉన్నట్టు ట్రాక్ చేసి అరెస్ట్ చేశారు. రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు గోవాలో గురువారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గోవా స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పీటీ వారెంట్ తీసుకుని.. హైదరాబాద్ తీసుకొచ్చారు. జానీ మాస్టర్‌పై ఈ నెల 15న రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో లైంగిక వేధింపులకు సంబంధించి జీరో ఎఫ్ఐఆర్ నమోదయింది. అదే రోజున నార్సింగ్ పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం బాధితురాలి వాంగ్మూలాన్ని సేకరించారు.




## కాంగ్రెస్ అంటేనే అబద్ధం, మోసం

### తెలంగాణలో రుణమాఫీ చేయలేక పోతోంది
### కర్నాటకలో వినాయకుడిని జీపెక్కించారు
### టుక్డే..టుక్డే గ్యాంగ్ కాంగ్రెస్‌ను నడిపిస్తోంది
### మహారాష్ట్ర వార్ధాలో మోడీ ఘాటు విమర్శలు

ముంబయి, సెప్టెంబర్ 20 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ అంటేనే అబద్ధం, మోసం, నిజాయతీ లేకపోవడం అని ప్రధాని నరేంద్రమోదీ ఘాటుగా విమర్శించారు. తెలంగాణలో రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చి రైతుల నుంచి తప్పించుకొని తిరుగుతోందని మండిపడ్డారు. మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో అత్యంత అవినీతికరమైన కుటుంబం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ రాజకుటుంబమే అని ప్రధాని తీవ్రంగా మండిపడ్డారు. అర్బన్ నక్సల్స్, తుక్డే తుక్డే గ్యాంగ్ కాంగ్రెస్‌ను నడిపిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పుడున్నది గతంలోని కాంగ్రెస్ కాదని, ఆ పార్టీలో దేశభక్తి, స్ఫూర్తి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు. గణపతి ఉత్సవాలను కూడా ఆ పార్టీ వ్యతిరేకిస్తోందని మోదీ పునరుద్ఘాటించారు. నేటి కాంగ్రెస్ గణపతి పూజను కూడా అసహ్యించుకుంటోంది. స్వాతంత్య్ర పోరాట సమయంలో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ నాయకత్వంలో దేశ ఐక్యతను పెంచడానికి గణపతి ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలు కలిసి పాల్గొంటారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వినాయకుడి విగ్రహాన్ని పోలీసు జీపులో ఎక్కించి, అవమానించిన ఘటన మీ అందరికీ తెలుసు. ప్రజలు పూజించిన దేవుని విగ్రహాన్ని పోలీసు వ్యాన్‌లో బంధించారు. ఈ విషయంపై కాంగ్రెస్ మిత్రపక్షాలు కూడా మౌనంగా ఉండడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. కాబట్టి మనమంతా ఏకమై కాంగ్రెస్ చేస్తున్న పాపాలకు తగిన బుద్ధి చెప్పాలని మోదీ అన్నారు. నేటి కాంగ్రెస్‌లో దేశభక్తి స్ఫూర్తి చచ్చిపోయి, ద్వేషం అనే దెయ్యం ప్రవేశించిందని మోదీ దుయ్యబట్టారు. కర్ణాటక, తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కష్టాల్లోకి నెట్టేస్తోందని అన్నారు. విదేశాలకు వెళ్లి దేశానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ భరతమాతను, దేశ సంస్కృతిని అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## శ్రీవారి లడ్డూ కల్తీపై సమగ్ర నివేదిక ఇవ్వండి

**మొదటి పేజీ తరువాయి...**

ఆయనతో (సీఎం చంద్రబాబు) మాట్లాడాను. వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపించమని చెప్పాను. కేంద్రం ఈ విషయంలో రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకొంటాం. ఇప్పటికి నివేదికే కోరాం" అని తెలిపారు. తిరుమల ప్రసాదంలో కల్తీపై మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా స్పందించారు. ఇది ఏమాత్రం క్షమించరాని నేరమని ఆయన అభివర్ణించారు. అదే సమయంలో ఈ వ్యవహారంలో మత కోణం ఉంటుందనే అనుమానం వ్యక్తం చేశారు. బోర్డులో అన్యమతస్తుల కారణంగానే కల్తీ నెయ్యి సరఫరా అయిందన్నారు.

**ఇది ప్రజల విశ్వాసంపై దాడి: ముక్తార్ అబ్బాస్ నఖ్వీ**

తిరుమల ప్రసాదంలో కల్తీపై భాజపా సీనియర్ నేత ముక్తార్ అబ్బాస్ నఖ్వీ స్పందించారు. "ఇది ప్రజల విశ్వాసంపై నేరుగా జరిగిన దాడి. వారి నమ్మకాన్ని వమ్ముచేయడమే. పక్కా ప్రణాళికతో జరిగిన కుట్ర ఇది. కేవలం వ్యాపార ప్రయోజనాల కోసం కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. దీనికి కారకులను కఠినంగా శిక్షించాలి. ఇది ఏమాత్రం క్షమించరాని నేరం" అని వ్యాఖ్యానించారు.

'వైకాపా ప్రభుత్వంలో హయాంలో అపవిత్రంగా లడ్డూలు తయారు చేశారు. వాటిల్లో వినియోగించిన ముడిసరకులు నాణ్యమైనవి వాడకపోవడం ఒక ఎత్తు.. అపవిత్రమైనవి వాడటం మరో ఎత్తు. తితిదే పరీక్షలు చేయించగా ఈ విషయం నిర్ధారణయింది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం స్పష్టం చేశారు. తిరుమలలో ఇప్పటికే ఈ విషయంలో మార్పులు చేశామన్నారు. లడ్డూ తయారీలో నాణ్యమైన నెయ్యి వాడుతున్నామని.. దీంతో లడ్డూ నాణ్యత మెరుగుపడిందని చెప్పారు. దీన్ని మరింత మెరుగుపరుస్తామని, తిరుపతిని ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు.

**ఇది చాలా తీవ్రమైన విషయం.. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ**

తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో నాసిరకం వస్తువులతో పాటు జంతువుల కొవ్వు వినియోగించారనే ఆరోపణలతో చెలరేగిన దుమారంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ స్పందించారు. దిల్లీలో జరుగుతున్న గ్లోబల్ ఫుడ్ రెగ్యులేటరీస్ సమ్మిట్‌కు హాజరైన ఆయన.. ఈ అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. " ఇది చాలా తీవ్రమైన విషయం. అందరినీ ఆందోళనకు గురిచేసే అంశం. ఇది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం. ఏపీలో సీఎం చెప్పినట్లు ఇది చాలా తీవ్రమైనది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలి. ఆ తర్వాత తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవాలి" అన్నారు.

## నెయ్యిలో కల్తీ ఉన్నట్లు గుర్తించాం

### పోటులో కూడా తయారీదారులు చెప్పారు
### గుజరాత్‌లో పరీక్షలకు పంపాక తెలుసుకున్నం
### కల్తీ నెయ్యిపై టిటిడి ఇవో శ్యామలరావు వివరణ



తిరుమల, సెప్టెంబర్ 20 (ప్రభాత ఉదయం): తిరుమల శ్రీవారి మహాప్రసాదం లడ్డూలో కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోన్న వేళ తితిదే ఈవో శ్యామలరావు స్పందించారు. శ్రీవారి లడ్డూ నాణ్యతపై కొంత కాలంగా ఫిర్యాదులు వస్తున్నాయి. నాణ్యతపై పోటు సిబ్బందితో మాట్లాడాను. వారు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. లడ్డూ నాణ్యతగా ఉండాలంటే.. నెయ్యి నాణ్యంగా ఉండాలని చెప్పారు. నెయ్యి నాసిరకంగా ఉందని గుత్తేదారుకు చెప్పాం. నెయ్యిలో నాణ్యతా లోపాన్ని నేను కూడా గమనించాను. నెయ్యి నాణ్యత నిర్ధారణకు తితిదేకు సొంత ప్రయోగశాల లేదు. నెయ్యి నాణ్యతపై అధికారులు గతంలో పరీక్షలు చేయలేదు. నాణ్యత నిర్ధరణ కోసం బయట ల్యాబ్స్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి. రూ.411కే కిలో నెయ్యి సరఫరా చేశారు. నాణ్యమైన నెయ్యిని అంత తక్కువ ధరకు సరఫరా చేయలేరు. మేం హెచ్చరించిన తర్వాత గుత్తేదారులు నాణ్యత పెంచారు అని ఈవో తెలిపారు. నాలుగు ట్యాంకర్లలో నెయ్యిని జులై 6న.. 10 ప్రయోగశాలలకు పంపాం. నెయ్యి నాణ్యత నిర్ధరణ కోసం ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపాం. ఎన్‌డీడీబీ చాలా ప్రముఖమైనది గుజరాత్‌లోని ఆనంద్‌లో ఉంది. ల్యాబ్ పరీక్షల్లో నెయ్యి నాణ్యత లేదని, భారీగా కల్తీ జరిగినట్టు నివేదికలు వచ్చాయి. వారంలో ల్యాబ్ నివేదికలు రెండు విభాగాలుగా ఇచ్చారు. నెయ్యి నాణ్యత 100 పాయింట్లకు బదులు 20 పాయింట్లే ఉంది. జంతువుల కొవ్వు నెయ్యిలో కలిసినట్టు ఎన్‌డీడీబీ తేల్చింది. తమిళనాడుకు చెందిన ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగింది. నెయ్యి కల్తీ అయ్యిందని తేలిన వెంటనే చర్యలకు ఉపక్రమించాం. ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై కమిటీ వేశాం. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. నెయ్యి కల్తీ పరీక్ష కోసం బయటకు పంపడం తితిదే చరిత్రలో ఇదే తొలిసారని ఈవో శ్యామలరావు చెప్పారు.

## ఓటుకు నోటు కేసు బదిలీ కుదరదు

**మొదటి పేజీ తరువాయి...**

సుప్రీంకోర్ట్ వ్యాఖ్యానించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ దాఖలు చేశారని కోర్ట్ వ్యాఖ్యానించింది. విచారణ జరుగుతున్న ఈ దశలో జగదీశ్వర్ రెడ్డి పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోచేయలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇక ఈ కేసు విచారణలో జోక్యం చేసుకోవద్దని రేవంత్‌కు సుప్రీంకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. కేసుకు సంబంధించిన వివరాలను రేవంత్ రెడ్డికి రిపోర్ట్ చేయవద్దని ఏసీబీని కూడా కోర్ట్ ఆదేశించింది. సీఎం, హోంమంత్రికి ఏసీబీ డీజీ రిపోర్టు చేయనక్కర్లేదని పేర్కొంది. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి పర్యవేక్షణకు కూడా నిరాకరించింది. భవిష్యత్తులో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుంటే పిటిషనర్ మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని ధర్మాసనం సూచించింది. ట్రయల్ కోర్టు పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఆదేశించింది. సుప్రీంకోర్ట్ ఇచ్చిన ఈ ఆదేశాలతో ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డికి భారీ ఊరట దక్కినట్టయింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిన విషయం తెలిసిందే. బెయిల్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్ట్ ఆగ్రహం వ్యక్తం చేయడం, ఆయన క్షమాపణలు చెప్పింది విదితమే. ఆ సందర్భంగా ప్రస్తావిస్తూ సుప్రీకోర్ట్ ఇవాళ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. తమ తీర్పులపై అభిప్రాయం చెప్పే హక్కు అందరికీ ఉంటుందని సుప్రీంకోర్ట్ పేర్కొంది. అయితే ప్రజా జీవితంలో ఉన్నవారు ఆచితూచి మాట్లాడాలని ఈ సందర్భంగా హితబోధ చేసింది.



## సొంత మనుషులకు అమృత్ టెండర్లు

### నిజాలు నిగ్గు తేల్చాలన్న కెటిఆర్
### కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రికి లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ప్రభాత ఉదయం): అమృత్ టెండర్ల అంశంలో అవినీతి జరిగిందంటూ ఆరోపిస్తూ కేంద్రానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ రాశారు. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు మనోహర్‌లాల్ కట్టర్,. టోచన్ సాహూలకు కేటీఆర్ లేఖ రాశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత బావమరిది సృజన్‌రెడ్డికి, తమ్ముడి కంపెనీలకు అర్హతలు లేకున్నా కాంట్రాక్టులు కట్టబెట్టారని కేటీఆర్ లేఖలో ప్రస్తావించారు. వందల కోట్ల రూపాయల కాంట్రాక్టులను అప్పనంగా దక్కించుకున్న సీఎం కుటుంబీకుల వ్యవహారంపైన నిజాలు నిగ్గు తేల్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో జరిగిన టెండర్ల తాలూకా సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తొక్కిపెడుతుందని ఆరోపించారు. అమృత్ పథకంలో జరిగిన ప్రతీ టెండర్, పనులు దక్కించుకున్న కంపెనీల వివరాలను బహిర్గతం చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన ప్రతీ టెండర్‌ను సమీక్షించి, ఈ చీకటి టెండర్లను రద్దు చేయాలని కేంద్రాన్ని కోరారు. వెంటనే టెండర్ల తాలూకా ప్రతీ సమాచారాన్ని ప్రజల ముందు పారదర్శకంగా ఉంచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అర్హతలు లేకున్నా అమృత్ టెండర్లు దక్కించుకున్న కంపెనీలపైనా ఎంక్వయిరీ వేయాలన్నారు కేటీఆర్. ఆరు నెలలుగా ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేసినా, స్పష్టత ఇవ్వలేదని తెలంగాణ ప్రభుత్వ తీరుపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ స్పందించకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కేంద్రానికి కూడా భాగస్వామ్యం ఉందని ప్రజలు నమ్మాల్సి వస్తుందన్నారు.

## సింగరేణి కార్మికులకు దసరా బోనస్

**మొదటి పేజీ తరువాయి...**

పంచుతున్నాం. ఒక్కొక్క సింగరేణి కార్మికుడికి 1 లక్షా 90వేలు బోనస్ ఇస్తున్నాం. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.6 వేలు ఇస్తాం. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ఇవ్వడం ఇదే మొదటి సారి. గత ఏడాది కంటే 20 వేలు అధికంగా బోనస్ ఇచ్చాం. సింగరేణి లాభాల్లో 33 శాతం వాటాను కార్మికులకు బోనస్ గా అందిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికులు సైతం తమ వంతు పాత్ర పోషించారని వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులు ప్రభుత్వానికి తలమానికమని, సింగరేణి ఉత్పత్తిని పెంచుతూ ఇతర రాష్ట్రాలకు కూడా బొగ్గు ఎగుమతి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సింగరేణిని విస్తరిస్తూ కొంత పెట్టుబడి పెట్టే నిర్ణయాన్ని కూడా తీసుకున్నామన్నారు. సింగరేణిలో 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని.. తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా బోనస్ ఇస్తున్నామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేలు బోనస్ అందిస్తామన్నారు. లాభాలు కార్మికులకు పంచుతున్నామన్నారు. ఇదిలావుంటే రద బాధితులను ఆదుకునేందుకు సింగరేణి ఉద్యోగులు పెద్ద మనసుతో ముందుకొచ్చారు. సింగరేణి కార్మికులు తమ ఒకరోజు వేతనం రూ.10.25 కోట్లను తెలంగాణ సీఎ సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి కాలరీస్ వర్కర్క్ యూనియన్ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్, సింగరేణి సీఎండీ బలరాం, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌లు సెప్టెంబర్ 19న కలిసి అందజేశారు. దాంతోపాటు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం రూ.2.50 లక్షలను వరద బాధితుల కోసం విరాళం అందించారని తెలిసిందే.



## వ్యవసాయంలో పురుగు మందులు, జీవ సంబంధిత పురుగు మందుల

# అవశ్యకతపై రెండో రోజు చర్చ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆడిటోరియం లో ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో వ్యవసాయంలో పురుగు మందులు , జీవ సంబంధిత పురుగు మందుల అవశ్యకతపై రెండో రోజు శుక్రవారం జరిగింది. సుస్థిర వ్యవసాయంలో శిలింద్ర నాశక మందుల ప్రాముఖ్యత గురించి డాక్టర్ రాజా రామి రెడ్డి మాట్లాడుతూ... గతంలో సూటి రకాల మందుల కంటే ప్రస్తుతం పలు రకలైన ఒకేటే మందు లేదా కాకటెయిల్ మందులను రైతులు ఎక్కువగా వాడడం వల్ల పురుగులు , శీలింద్రాలు రోగ నిరోధక శక్తి పెంచుకొని రైతులకు సాగు ఖర్చును పెంచుతున్నాయ న్నారు. డాక్టర్ ధనుంజయ జోపే ( క్రోడా ఇంటర్నేషనల్ ) పురుగు మందులలో అజ్జువెంట్స్ వాడకంపై మాట్లాడుతూ... అజ్జువెంట్స్ వాడడం వలన పురుగు మందులు చాలా సమర్థవంతంగా గా పనిచేస్తాయన్నారు. ఏపీ ఎంఎంఏ అధ్యక్షులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ... పురుగు మందుల కంపెనీల, సవాళ్లు ముందుచూపు మీద ప్రసంగిస్తు భవిష్యత్తులో వ్యవసాయంకు చాలా మంచి రోజులు వున్నాయన్నారు . వ్యవసాయ వర్సిటీ, ఇన్పుట్ ఏజెన్సీస్, వ్యవసాయశాఖ , రెగ్యులటోరీ యంత్రాంగం కలియక తో క్రొత్త పురుగు మందుల కనుగొనుట తద్వారా రైతుల పొలాల్లోక్షేత్ర , పరిశోధన చేయడం ద్వారా వ్యవసాయం లో నష్టాలను త్సగ్గించవచ్చన్నారు . ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ... వ్యవసాయంలో డ్రోన్స్ వాడకం పై ప్రస్తుతం తెలంగాణ రాష్టంలో చాలా మంది రైతులు వాడుతున్నారు. చాలా వరకు పురుగు మందులను రైతులు గాలి ఎక్కువగా వున్నపుడు పిచికారీ చేయడం వలన ఇతర పంటలలో నష్టం జరుగుతుందానారు. డ్రోన్స్ తో కలుపు మందులు పిచికారీకి రాబోయే రోజుల్లో పరిశోధనలు చేయడానికి భారత ప్రభుత్వం ఇంకా అనుమతి రావలిసిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ విశ్వ విశ్వవిద్యాలయం డ్రోన్స్ వాడడం పై రైతులకు , యువతకు వారం రోజుల పాటు శిక్షణ ఇస్తుందన్నారు. ఆ తర్వాత వ్యవసాయం లో నకిలీ పురుగు మందులు వాడకంపై చర్చ గోష్టి కార్యక్రమంలో శాస్త్రవేతలు, తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రైతులు పాల్గొన్నారు. ఈ చర్చలో చాలా మంది రైతులు నకిలీ మందులు తక్కువ ధరకే లభించడం, డీలర్స్ క్రెడిట్ ఇవ్వడం,కొన్ని మందులు బాగానే పని చేయడం వల్ల వాడుతున్నాము అన్నారు. ఈ నకిలీ మందులను అరికటలంటే రైతులు అందరు తప్పకుండా జిఎస్ టి బిల్ తీసుకోవాలి,



రెగ్యులర్ విజిలేన్స్, %ు=% కోడ్ ముద్రించడం, వ్యవసాయ అధికారులుకు , రైతులకు తప్పకుండా అవగాహనా కలిపించాలాన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్. జగదీశ్వర్, డాక్టర్ గురు రాజు కట్టి, డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి, నారాయణ రెడ్డి, రైతులు,విశ్వ విద్యాలయ ప్రతినిధులు వ్యవసాయ శాస్త్రవేతలు, విద్యార్థులు , పరుగు మందుల యాజమాన్యం సిబ్బంది పాల్గొన్నారు. ఈ రెండు రోజులలో చర్చకు వచ్చిన అంశాలను కేంద్ర పురుగు మందుల ధ్రువీకరణ , అదికృత సంస్థకి అందిస్తామని డాక్టర్ శరత్ బాబు, డాక్టర్ పి వి కే సింగ్ (చీఫ్ ఎడిటర్ అఫ్ PPAI) తెలిపారు.రెండు రోజుల కార్యక్రమం లో చివరిగా 14 వక్తలు పురుగు మందులు, జీవ సంబంధమయిన తయారీ, వాడుకలోమరి వాటి నియంత్రణ కు చెప్పటవల్సిన అంశాల పైనా విస్తృతంగా చర్చించారు. రెండు తెలుగు రాష్ట్రాలు,మన దేశంలో , ఇతర దేశాలలో జరుగుతున్న నూతన పరిశోధనలు గురించి చర్చించి రాబోయే రోజుల మరిన్ని చెప్పటల్సిన కార్యాచరణ ప్రణాళికను తయారు చేయడం జరిగింది.రెండు రోజులలో తీసుకున్న నిర్ణయాలను వివిధ వ్యవసాయ శాఖ , అనుబంధ శాఖలతో బాటు,దేశంలో ని వ్యవసాయ వర్సిటిలకు, భారత వ్యవసాయ పరిశోధన మండలి సంస్థలకు భారత ప్రభుత్వం లోని పలు వ్యసాయం , సంబంధిచిన పలు శాఖలకు అందజేశారు.



## నేడు విద్యుత్తు లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) మైలార్ దేవుపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని గ్రీన్ విచ్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో గల రహమత్ కాలనీ, జహంగీరాబాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి 11 గంటల వరకు క్రిస్టల్ టౌన్, వాదేయి ఫర్హా న్, మిల్లత్ నగర్, జహంగీరాబాద్, రాయల్ సి హెూటల్ ఏరియా, న్యూర్ నగర్, రహమత్ కాలనీ కొంత భాగం, నవశక్తి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 1:00 వరకు శుభహాన్ కాలనీ ఫేస్ -3, పారిశ్రామిక ప్రాంతం, మిలాన్ కాలనీ, మహమ్మద్ నగర్, నవశక్తి ఇండస్ట్రీ, కింగ్స్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మైలార్ దేవుపల్లి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### కాటేదాన్ లో...

కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని గ్రీన్విచ్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో గల లక్ష్మి గూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నుండి 12:30 వరకు లక్ష్మి గూడ గ్రామం, హౌసింగ్ బోర్డ్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, వాంబే కాలనీ బృందావన్ కాలనీ గణేష్ నగర్, హౌసింగ్ బోర్డ్ ప్రాంతాలలో లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు.

### ఇబ్రహీం బాగ్ విద్యుత్ సెక్షన్లో.

ఇబ్రహీం భాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గల ప్రాంతాలైన పంచవటి కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి 1:30 వరకు పంచవటికాలని, ట్రైన్స్ విల్లాఎస్, ఫ్రెండ్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి 11:30 వరకు ఫ్రెండ్స్ కాలనీ ఓకల్వాడ, తనాశ నగర్ హుడా కాలనీ, అల్కాపూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి రెండు గంటల వరకు అల్కాపూర్ రోడ్డు నెంబర్ 14 నుండి 22 వరకు, తుల్జారాం విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి రెండు గంటల వరకు అల్కాపూర్ రోడ్ నెంబర్ 22 నుంచి 30 వరకు, పీజీ కాలేజీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి రెండు గంటల వరకు డోలార్ హిల్స్, తిరుమల హిల్స్, బయత్కాలనీ, పీజీ కాలనీ, అల్కాపూర్ రోడ్ నెంబర్ 1, 2, జై భవాని విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుండి 4:30 వరకు ఓఆర్ సర్వీస్ రోడ్డు నుండి మై హెూమ్ అవతార్ నుండి అపర్ణ ఎలిజర్ వరకు, జన చైతన్య విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి రెండు గంటల వరకు జన చైతన్య కాలనీ, పంచవటికాలని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు

### హిమాయత్ సాగర్ సెక్షన్లో...

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి ఒకటిన్నర వరకు హైదర్ షాకోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశస్త నగర్, తిరుమల గార్డెన్, రాధా క్రియేటర్ ఫేస్-2, పావని హార్మోని విల్లా స్, బచ్పన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్ కొంత భాగం ప్రధాన రహదారి, మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు పెద్ద మంగళారం విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన మాధవ నగర్, సౌభాగ్యనగర్ కాలనీ,సాయి హర్ష కాలనీ, హైదర్ షాకోట్, మధ్యాహ్నం 12:30 నుండి రెండున్నర వరకు పి అంటీ కాలనీ విద్యుత్ పీటర్ పరిధిలో గల ప్రాంతాలైన పి అండ్ టి కాలనీ ఏ బి సి డి, స్పెషల్ బ్లాక్ ,11:30 నుండి ఒంటిగంట వరకు సాయిరాం నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో సాయిరాం నగర్ కాలనీ, సాయిరాం ఎంక్లేవీ, సౌభాగ్యనగర్, సాయి హర్ష కాలనీ, సన్ సిటీ, మధ్యాహ్నం 11:30 నుండి 12 గంటల వరకు స్నేహిత విద్యుత్ ఫీడర్ పరిధిలో 60 యార్డ్స్, జే ఎన్ ఎన్ యు ఆర్ ఎం గృహకల్ప క్వార్టర్స్, 11 గంటల నుండి 11:30 వరకు మిలిటరీ విద్యుత్ పీటర్ పరిధిలో గల ప్రాంతాలైన విశ్వా స నగర్, స్పెషల్ బ్లాక్, బి బ్లాక్, సన్ సిటీ ప్రధాన గేట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ పి శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

గద్వాల జిల్లా ఆస్పత్రిలో ఏసి పనిచేయకపోవటంతో ఇబ్బందులు పడుతున్న రోగులు

## గద్వాల జిల్లా ఏరియా ఆసుపత్రిలో ఐసీయూలో పనిచేయని ఏసీలు

ఇబ్బందులు పడుతున్న రోగులు.. పట్టించుకోని వైద్యులు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఐ.సి.యు విభాగంలో సరైన మౌలిక వసతులు లేక రోగులు అరకొర వసతుల మధ్యనే చికిత్స పొందుతున్నారు.ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో తీవ్రమైన అనారోగ్యం లేదా గాయాలతో బాధపడుతున్న రోగులకు క్రిటికల్ కేర్ మరియు లైఫ్ సపోర్టును అందించే ప్రత్యేక ఆసుపత్రి విభాగం. ఆ యూనిట్ లో అనుభవం ఉన్న వైద్యులు, నర్సులు మరియు రెస్పిరేటరీ థెరపిస్టులు నిరంతరం పర్యవేక్షణను అందిస్తారు.కానీ ఆ యూనిట్ లో సరైన వసతులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన ఏసీ సౌకర్యం లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా అరకొర ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో ఉక్కపోతకు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ వినోద్ వివరణ కోరగా ఐసీయూలో ఏసీలు రిపేర్ లో ఉన్న మాట వాస్తవమేనని, తాత్కాలికంగా ఫ్యాన్లను ఏర్పాటు చేశామని త్వరలోనే ఏసీలను రిపేర్ చేయించి అందుబాటులో ఉ ంచనున్నట్లు ఆయన తెలిపారు.



చెరీస్ హాస్టల్ వార్డెన్ సునీతను నిలదిస్తున్న విద్యార్థినీల తల్లులు

## హాస్టల్ వార్డెన్ కొడుతుంది

### మేం హాస్టల్ కి వెళ్ళాం అంటూ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న విద్యార్థినీలు

బుద్వేల్, సెప్టెంబర్20(ప్రభాత ఉదయం): మా వార్డెన్ కొడుతుంది.. మాతో పనులు చేపిస్తుంది ...అంటూ శుక్రవారం కిస్మత్‌పూర్‌లోని చెరీస్ హాస్టల్ విద్యార్థినీలు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వివిధ జిల్లాలకు చెందిన బాలికలు కిస్మత్ పూర్ లోని చెర్రీస్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న హాస్టల్లో ఉంటూ బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు.శుక్రవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థినీలు తమకు ఉదయం వార్డెన్ సునీత టిఫిన్ పెట్టలేదని, బస్సు రాకపోవడంతో నడుచుకుంటూ వెళ్ళమని చెప్పిందని ఉపాధ్యాయులకు తెలిపారు. అంతేకాకుండా తమ చేత టైల్స్ మోయిస్తుందని, బియ్యం బస్తాలు మోయిస్తుందని, అన్ని పనులు చేయిస్తుం దని, ప్రతి విషయానికి కొడుతుందని చెప్పి... తాము హాస్టల్ కు వెళ్ళమని తెలిపారు. అది విన్న ఉపాధ్యా యులు వివిధ ప్రాంతాల్లో ఉండే వారి తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడించారు. కొందరు విద్యార్థుల తల్లిదం డ్రులు పాఠశాలకు వచ్చి రాజేంద్రనగర్ షీ టీమ్స్ పోలీసులకు సమాచారం అందించారు. షీ టీం పోలీసులు స్కూల్ వద్దకు వచ్చి మీరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులు పాఠశాల, ఉపాధ్యాయులు పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఇన్స్ పెక్టర్ ను కలిసి సమస్యను వివరించారు.

### వార్డెన్‌ను, నిర్వాహకురాలిని పిలిచి మాట్లాడిన ఇన్స్‌పెక్టర్

పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ వార్డెన్ కొడుతున్నారని చెప్పిన విద్యార్థినీల సూచన మేరకు రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో హాస్టల్ వార్డెన్ సునీత తో పాటు నిర్వాహకురాలు నీలిమ ల ను పిలిపించి మాట్లాడారు.

## పత్తికుంటలో మునిగి ఓ యువకుడు మృతి

**బుద్వేల్, సెప్టెంబర్20 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ హనుమాన్ నగర్ పత్తికుంట లో మునిగి ఓ వ్యక్తి శుక్రవారం మరణించాడు. వినాయక నిమజ్జనం సందర్భంగా వేసిన వినాయక ప్రతిమలకు ఉండే ఇనుప రాడ్ లను తీసుకుందామని చెరువులోకి దిగిన ఎస్ అంజి( 35 ) నీట మునిగి ఇనుప రాడ్లు గుచ్చుకొని మరణించాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు వెలికి తీశారు.**


ఎస్ అంజి



జానీ మాస్టర్‌ను రాజేంద్రనగర్ కోర్టుకు తీసుకువస్తున్న పోలీసులు

## జానీ మాస్టర్‌కు 14 రోజుల రిమాండ్

మొదటి పేజీ తరువాయి...

వెళ్లిపోయారు. ఆర గంట సేపు జడ్జి ముందు వాదనలు జరిగాయి. మధ్యాహ్నం రెండు గంటల ఐదు నిమిషాలకు తిరిగి పోలీస్ వాహనంలో జానీ మాస్టర్ ను చంచల్ గూడ జైలుకు తరలించారు.




గద్వాల తహసీల్దారుగా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లికార్జున్

## గద్వాల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున్

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం)గద్వాల మండల తహశీల్దార్ గా మల్లికార్జున్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వనపర్తి జిల్లాలో డిప్యూటీ తహశీల్దారుగా సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. ఇటీవల తహశీల్దార్ గా పదోన్నతి పొందారు. శుక్రవారం గద్వాల తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్చార్జి తహశీల్దార్ కరుణాకర్ నూతన తహశీల్దార్ మల్లికార్జున్ కు బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ తహశీల్దార్ శివకుమార్, ఆర్ఐలు శ్రీనివాసులు, మదన్, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మదనపల్లి సర్పంచ్ టి కృష్ణ, చెనుగొనిపల్లి గుర్రం వెంకటేష్, ఆటో కృష్ణ, తదితరులు నూతన తహశీల్దార్ మల్లికార్జున్ కు శుభాకాంక్షలు తెలిపారు.



మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

## మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్

కొత్తకోట, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) మున్సిపాలిటీ పరిధిలో గత 30 సంవత్సరాల నుండి పారి శుద్ధ కార్మికులుగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔర్ సోర్సింగ్, ఎన్ ఎమ్ ఆర్, ఫిక్స్ పే డైలీ వేజ్ తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న సిబ్బంది వెంటనే పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్మికులు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు కనీస వేతనము రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి ప్రభుత్వ సంక్షేమలు కార్మికులకు రక్షణ సదుపాయాలు కల్పించడం లేదని ఆయన ఆరోపించారు. అనేకమంది ప్రమాదంలో కార్మికులు మరణిస్తున్న వారికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బంది అందర్నీ పర్మినెంట్ చేయాలని కనీస వేతనం 26 వేలు నిర్ణయించాలని 8 గంటల పని దినాలను అమలు చేయాలని ప్రమాదంలో మరణిస్తున్న కార్మికులకు 25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చదువు, వృత్తి నైపుణ్యతను గుర్తించి జవాన్లు, డ్రైవర్లుగా,శానిటరీ ఇన్స్పెక్టర్లుగా కంప్యూటర్ ఆపరేటర్లుగా ప్రమోషన్ కల్పించాలనిచెప్పారు. హరితహారం శాని టరీ పనులు చేస్తున్న 15 మంది కార్మికుల ఎనిమిది నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్యూనియన్ అధ్యక్షులు ఆనంద్ రాజ్, కే వెంకటయ్య, కే కృపయ్య, కొండన్న ,మద్దిలేటి,పెద్దరాజు, లక్ష్మి,మన్నెమ్మ,సుశీల,సుగుణమ్మ, శిరీష, సరళ, లత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తల జీతాల పెంపు కోసం కృషి చేస్తా: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, సెప్టెంబర్20(ప్రభాత ఉదయం): సెప్టెంబర్ 1 నుండి 30 వరకు జరుపుకునే పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా, ఐ.సి.డి.ఎస్.అల్వాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మల్కాజిగిరి , అల్వాల్ సెక్టర్ పరిధిలోని మాసోత్సవం నేరెడ్మెట్ డివిజన్ జి.కే.సరస్వతి ఫంక్షన్ హాల్ జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు,. "నేటి సుపోషిత బాలికలే - రేపటి శక్తి వంతమైన మహిళలు"అనే నినాదంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... అంగన్వాడీ కార్యకర్తల జీతాల పెంపు కోసం కృషి చేస్తామని, ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలు అర్హులైన అంగన్వాడీ కార్యకర్తలకు అందేలా కృషి చేస్తానని , ఏ సమస్యా ఉన్నా నా దృష్టి కి తీసుకురావాలని ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాను అని అన్నారు. ఈ కార్యక్రమానికి సి డి పి ఓ స్వాతి, కార్పొరేటర్లు, సబితా అనిల్ కిషోర్ ,మీనా ఉపేందర్ రెడ్డి, మేకల్ సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ శ్రీదేవి, సీనియర్ నాయకులు రావుల అంజయ్య, బద్దం పరశురామ్ రెడ్డి, జీ.కే హనుమంత్ రావు, అంగన్వాడీ, సూపర్వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.





పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

# మాజీ అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి



డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బిజెపి పార్లమెంట్ ఇంచార్జ్ పవన్ కుమార్ రెడ్డి, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి

### డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

### మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పార్లమెంట్ బిజెపి ఇన్చార్జ్ పవన్ కుమార్ రెడ్డి

కొత్తకోట, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) అలంపూర్ మాజీ శాసనసభ్యులు (బిజెపి) డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు కొత్తకోట మండలం కనాయపల్లి గ్రామంలో శుక్రవారం మాజీ శాసనసభ్యులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి జన్మదినం సందర్భంగా దేవరకద్ర మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పాలమూరు పార్లమెంట్ బిజెపి డోకూరు పవన్ కుమార్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి , వనపర్తి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుంద్రాతి వామన్ గౌడ్ లు ఆయనను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండలాధ్యక్షుడు కృష్ణంరాజు,జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఫరూక్, మధునాపురం మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, వెంకటయ్య, కొత్తకోట మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకోటలో ఘనంగా సాయి చంద్ జయంతి వేడుకలు

కొత్తకోట, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) తన ఆటపాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఉగిసిపడేలా ఊపిరి పోసిన రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాయి చంద్ 41 వ జయంతి వేడుకలను శుక్రవారం కొత్తకోట పట్టణంలో ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. సాయి చంద్ జయంతి సందర్భంగా ఆయన సతీమణి రజనీ సాయిచంద్ కేక్ కట్ చేశారు. సాయిచంద్ జయంతి వేడుకలలో గద్వాల జిల్లా బీఆర్ఎస్ నాయకులు బాసు హన్మంతు నాయుడు, మోనేష్ మారోజు, తిరుమల్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్ని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాయి చంద్ అభిమానులు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పలువురు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



స్వర్గీయ గాయకుడు జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఆయన సతీమణి రజనీ



సీనియర్ నాయకులు శేషంపల్లి నరసింహులు సన్మానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

## ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సీనియర్ నాయకులు శేషం పల్లి నర్సింహులు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ని మల్దకల్ మండలం సీనియర్ నేత శేషం పల్లి నర్సింహులు శుక్రవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి శేషం పల్లి నరసింహులు ను శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ ఎంపీపీ విజయ్, సీనియర్ నాయకులు సత్యం రెడ్డి విక్రమ్ సింహరెడ్డి, నరసింహా రెడ్డి, వెంటన్న, ఆంజనేయులు, మధు నాయకి, చంద్రశేఖర్, భాస్కర్ గౌడ్, వెంకట్ రెడ్డి, వాసు రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మొహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్బంగా టెక్కలయ్య దర్గా వద్ద రక్త దాన శిబిరం ఏర్పాటు

## 45వ సారి రక్త దానం చేసిన ఉద్యమకారుడు చాంద్ పాషా

### అభినందించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి,రెడ్ క్రాస్ సొసైటీ,మున్సిపల్ కౌన్సిలర్

కొత్తకోట,సెప్టెంబర్20(ప్రభాత ఉదయం)కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని టెక్కల్లయ్య దర్గా వద్ద..మొహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా..రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..కొత్త కోట యూత్..మీలాద్ బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయగా వనపర్తి జిల్లా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జయ చంద్ర మోహన్,మున్సిపల్ కౌన్సిలర్ ఖాజా మైనోద్దిన్,కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షులు సలీం ఖాన్, ఫ్లంబర్ మతీన్ లు పాల్గొని కొనసాగుతున్న బ్లడ్ క్యాంప్ ను పరిశీలించారు.ఈ బ్లడ్ క్యాంపులో పాల్గొని 45వ సారి రక్త దానం చేసిన ఉద్యమ కారుడు చాంద్ పాషా నుఅభినందించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కాలం పాషా,రెడ్ క్రాస్ సొసైటి కార్యవర్గ సభ్యులు అహెమద్ బిన్ ఉమర్,జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కో ఆర్డినేటర్ రాజేష్ కుమార్ లు పాల్గొన్నారు.



## కుర్వపల్లి గ్రామంలో కళాకారుల ఆటపాట


గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం)తెలంగాణ సాంస్కృతిక శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డ్రగ్స్ మరియు గుట్కా, పాన్ మసాలా నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, సీజనల్ వ్యాధులు జాగ్రత్తలపై శుక్రవారం కుర్వపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ ఆదేశాలతో డీ పీ ఆర్ వో అరిఫుద్దీన్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన పర్యటించి మూఢనమ్మకాలు బాల్యవివాహాల నిర్మూలన తదితర అంశాలపై కళాకారులు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాకారులు కేశవులు, ప్రసాద్, రమాదేవి, హజ్రత్, రాహుల్, భూపతి, కృష్ణ, స్వామి తమ ఆట పాట మాటలతో అవగాహన కల్పించారు.

## మల్దకల్ ఎస్ఐగా నందీకర్ బాధ్యతలు స్వీకరణ




గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం)మల్దకల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా నందీకర్ శుక్రవాదం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నూతన ఎస్ఐ కి పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ పని చేస్తున్న సురేష్ గౌడ్ వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు.

## మెకానిక్ షెడ్లో బైక్ దగ్ధం



గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం)గద్వాల టౌన్ పోలీస్ పరిధిలోని ఓ మెకానిక్ షెడ్లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... గద్వాల మండలం వెంకంపేట గ్రామానికి చెందిన సలీం గద్వాల పట్టణం భీంనగర్ రోడ్డులో బైక్ మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం షెడ్లో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలు ఆర్పారు. షెడ్లో ఉన్న ఓ బైక్ పూర్తిగా దగ్ధమయ్యాయింది. కాగ గద్వాల పట్టణం కృష్ణవేణి చౌక్ నుండి భీంనగర్ రోడ్డులో పుట్ పాత్ ను అక్రమించుకుని చాల మంది రేకుల షెడ్ ఏర్పాటు చేసుకుని చిరువ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మెకానిక్ ఏర్పాటు చేసుకున్న బైక్ షెడ్ కు ఎలాంటి విద్యుత్ కనెక్షన్ లేదు. షెడ్డు పక్కన ఖాళీ ప్రదేశంలో చెత్తకు నిప్పంటుకోవడంతో మెకానిక్ షెడ్డులోకి వ్యాపించి షెడ్డు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.2లక్షల వరకు ఆస్థినష్టం వాటిలిందని బాధితుడు సలీం పేర్కొన్నారు.




## ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి.. మహిళలకు అండగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం

### మహిళలకు మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ పథకంలో భాగంగా ప్రొసిడింగ్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం)కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన 6 గ్యారంటీ హామీలను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ధరూర్, కేటిదొడ్డి, గట్టు, తదితర మండల కేంద్రాలలో మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500 గ్యాస్ సిలిండర్ ప్రొసిడింగ్ పత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. గట్టు మండలంలో 8,006, ధరూర్ 6,182, కేటిదొడ్డి 4,739 మంది లబ్దిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు ఆర్టీసి బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళల కోసం సీఎం రేవంత్ రెడ్డి నేడు రాష్ట్ర వ్యాప్తంగా మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ లో పంపిణీ ప్రారంభించిందన్నారు. గృహ జ్యోతి పథకంలో భాగంగా ప్రతి ఇంటికి 200 యూనిట్ల విద్యుత్ అందజేస్తుందన్నారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీని చేయడం జరిగిందన్నారు. త్వరలోనే దసరా పండుగ కానుక పేద ప్రజలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ నల్ల హనుమంతు, జెడ్పీసీఈఓ కాంతమ్మ, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల జిల్లా ఏరియా ఆసుపత్రిలో ఐసీయూలో పనిచేయని ఏసీలు

### ఇబ్బందులు పడుతున్న రోగులు... పట్టించుకోని వైద్యులు



గద్వాల జిల్లా ఆస్పత్రిలో ఏసి పనిచేయకపోవటంతో ఇబ్బందులు పడుతున్న రోగులు

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఐ.సి.యు విభాగంలో సరైన మౌలిక వసతులు లేక రోగులు అరకొర వసతుల మధ్యనే చికిత్స పొందుతున్నారు.ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో తీవ్రమైన అనారోగ్యం లేదా గాయాలతో బాధపడుతున్న రోగులకు క్రిటికల్ కేర్ మరియు లైఫ్ సపోర్టును అందించే ప్రత్యేక ఆసుపత్రి విభాగం. ఆ యూనిట్ లో అనుభవం ఉన్న వైద్యులు, నర్సులు , రెస్పిరేటరీ థెరపిస్టులు నిరంతరం పర్యవేక్షణను అందిస్తారు.కానీ ఆ యూనిట్ లో సరైన వసతులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన ఏసీ సౌకర్యం లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా అరకొర ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో ఉక్కపోతకు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ వినోద్ వివరణ కోరగా ఐసీయూలో ఏసీలు రిపేర్ లో ఉన్న మాట వాస్తవమేనని, తాత్కాలికంగా ఫ్యాన్లను ఏర్పాటు చేశామని త్వరలోనే ఏసీలను రిపేర్ చేయించి అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు.





## ప్రస్తుత వర్షాకాల సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండండి

### మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేషిని విశ్వేశ్వర్..

### 8వ వార్డులో పరిసరాల పరిశుభ్రత పై అవగాహన

కొత్తకోట, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) ప్రస్తుత వర్షాకాల సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట మున్సిపల్ చైర్మన్ పొగాకు సుకేషిని విశ్వేశ్వర్ సూచించారు. శుక్రవారం కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో నిల్వ నీటిని తొలగించే విధానంపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పొగాకు సుకేశిని మాట్లాడుతూ ...నిల్వ నీటిని ఎప్పటికప్పుడు..నిల్వ లేకుండా చేయాలని..లేనిపక్షంలో శుభ్రమైన నీటిని నుండి దోమలు తయారై ప్రమాదకరమైన డెంగ్యూ వ్యాధికి దారితీస్తుందన్నారు.దీంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకొకపోతే మలేరియా..టైఫాయిడ్ లాంటి భయంకరమైన జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ సూర్య నారాయణ మాట్లాడుతూ... ప్రజలు అనారోగ్యాలకు గురి కాకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు.వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు..ప్రతి శుక్రవారం వార్డులలో స్వచ్ఛత హి సేవ ద్వారా నిర్వహించే.. డ్రై డే కార్యక్రమాన్ని 8వ వార్డులో ప్రారంభించి పరిసరాల పరిశుభ్రత పై..నిల్వ నీటిని తొలగించే విధానంపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిదంగా తడి చెత్త..పొడి చెత్తను వేరు చేసి మున్సిపాలిటీ అందించిన చెత్త బుట్టల ద్వారా వార్డులలో తిరిగే చెత్త ట్రాక్టర్లకు అందించి.. పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రవీందర్, మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ చీర్ల నాగన్న సాగర్ ,15వ వార్డు కౌన్సిలర్ ఖాజా మైనోద్దిన్,ఉద్యమకారుడు చాంద్ పాషా,మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీధర్,వార్డు ఆఫీసర్లు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్వాడి టీచర్లు,ఆర్పిలు,ఆశా వర్కర్లు,వాటర్ వర్క్స్ వర్కర్లు, పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డికి పుష్పగుచ్చం అందజేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

కొత్తకోట, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) తెలంగాణ ఉద్యమకారులు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి కు జన్మదినం సందర్భంగా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ,మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ,మాజీ జెడ్పివైస్ చైర్మన్ వామన్ గౌడ్ లు పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్ ,చెన్నకేశవ రెడ్డి , గాడీల అధ్విక్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు మూలమల్ల భీమిరెడ్డి



మాజీ అలంపూర్ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి జన్మదిన సందర్భంగా సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ మూలమల్ల భీమ్ రెడ్డి



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర రెడ్డి

కొత్తకోట, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను కొత్తకోట మండలం కానాయిపల్లి గ్రామంలో వివిధ పార్టీల నాయకులు అభిమానులు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి కి సీనియర్ నాయకులు, మాజీ రామకృష్ణాపురం సర్పంచ్ మూల మళ్ళ భీమ్ రెడ్డి, మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి,క్లాస్ వన్ కాంట్రాక్టర్ మూలమల్ల చక్రీగిరి వర్ధన్ రెడ్డి, యువ నాయకులు మూలమల్ల విక్రమ్ సింహ రెడ్డి, టీవీ 9 రిపోర్టర్ యెనుమల శ్రీనివాస్ , మాజీ వైస్ ఎంపీపీ రాములు, పి ఎస్ ఈ ఎస్ డైరెక్టర్ శ్రీనివాసులు , ఫీల్డ్ అసిస్టెంట్ మోగులన్న తదితరులు పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి

### మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి

కొత్తకోట, సెప్టెంబర్ 20(ప్రభాత ఉదయం) రక్తదానం చేసి ఒకరి ప్రాణాలకు ప్రాణదాతలు కండి అని అలంపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి జన్మదిన సందర్భంగా రాహుల్ హాస్పటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ రక్తదానం వల్ల ఒకరి ప్రాణాలు నిలపడమే కాకుండా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికే గాని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి అత్యవసర వేళలు మీరిచ్చే రక్తం ఎందరో జీవితాల్లో వెలుగు నింపేవారు అవుతారని అన్నారు. రక్తదానం చేసిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ జన్మదిన సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.




మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, చిత్రంలో రక్తదానం చేస్తున్న దాతలు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.